క్లుప్తంగా

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం


అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకు మాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ఈవో జీవీ రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో విశేషపూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి స్వయంగా జలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారికి నూతన చీర, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ గావించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు


వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్ఎం వెంకటలక్ష్మి

అల్లిపురం: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం బుధవారం కుమ్మరవీధి సచివాలయంలో చేపట్టారు. గర్భిణులు, బాలింతలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా వారికి ప్రసవం అయ్యేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఎన్ఎం వెంకటలక్ష్మి, తులసీ వివరించారు. బాలింతలు చిన్నారులకు తల్లిపాలను మాత్రమే అందించాలన్నారు. చిన్నారులకు హెపటైటిస్–బి, కోరింత దగ్గు, తట్టు, పోలియో వంటి వ్యాక్సిన్లు వేశారు. దేశంలో మరో వైరస్ వ్యాపిస్తుందన్న వార్తలను గుర్తు చేస్తూ జాగ్రత్త వహించాలన్నారు. మాస్కులు ధరించాలన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. షేక్ హ్యాండ్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు.

పోర్టు హాస్పిటల్ టెండర్ అడ్డుకుంటాం


పోర్టు హాస్పిటల్ వద్ద 100వ రోజు దీక్షలో సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండరు కోసం ఎవరొచ్చినా అడ్డుకుంటామని, ప్రైవేటీకరణను ఆపే వరకు పోరాడతామని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు సీహెచ్ పద్మనాభరాజు తెలిపారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 100వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ప్రైవేటీకరణ టెండర్ కోసం ఎవరొచ్చినా అడ్డుకుని తీరాలని, తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల కృషితోనే ఆస్పత్రి అభివృద్ధి సాధ్యమైందని, సుమారు 40 వేల మంది పోర్టు ఉద్యోగులు, వారి కుటుంబాలకు వైద్య సేవలందించే ఆస్పత్రి ప్రైవేటీకరణ అనైతికమన్నారు. కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, కేఎస్ కుమార్, నాయుడు పాల్గొన్నారు.

పాలిటెక్ ఫెస్ట్‌లో గైస్ విద్యార్థుల ప్రతిభ

మురళీనగర్ : విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్ 2024 – 25లో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీలో వీరు రూ.25 వేల కన్సొలేషన్ బహుమతిని మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రమాదాలను నియంత్రించేందుకు యానిమేటెడ్ ఏరియల్ వెహికల్ (యూఏవీ) డ్రోన్‌ను గైస్ విద్యార్థులు పి.భవానీ శంకర్, ఆర్.పైడిరాజు, ఎస్‌కే అబ్దుల్ రజాక్, టి.ప్రనూష్ బృందం రూపొందించింది. వీరికి కెమికల్ బ్రాంచ్ రిటైర్డ్ విభాగాధిపతి డాక్టర్ బీవీ లక్ష్మణరావు, అధ్యాపకుడు ప్రదీప్ గైడ్‌గా వ్యవహరించారు.

ఫుట్‌పాట్లు

- నడిచేందుకు వీలు లేక ప్రజల ఇక్కట్లు
- సర్వీస్ రోడ్లపై పార్కింగ్ కేంద్రాలతో మరిన్ని సమస్యలు
- సెల్లార్లు, ఫుట్‌పాత్‌లపై సైతం పెయిడ్ పార్కింగ్‌లు
- కొరవడిన పట్టణ ప్రణాళిక సిబ్బంది పర్యవేక్షణ


ఫుట్‌పాత్‌లకు అనుకుని ఏర్పాటు చేసిన దుకాణాలు


సర్వీసు రోడ్డులో స్క్రాప్ దుకాణాలు


జ్ఞానాపురం రహదారిలోని ఫుట్‌పాత్‌లపై ఇలా..

కంచరపాలెం: ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఏర్పాటు చేసిన బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్లను కొందరు వ్యాపారులు, దళారులు వ్యాపార, పార్కింగ్ కేంద్రాలుగా మారుస్తున్నారు. జ్ఞానాపురం ప్రధాన కూడలి నుంచి జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారుల్లోని ఫుట్‌పాత్‌లపై కూడా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఫుట్‌పాత్‌లకు ఆనుకుని ఉన్న దుకాణ యాజమానులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి తోపుడుబళ్లు, చిల్లర వ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారు. రోజు వారీ వసూళ్లు చేస్తూ ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్లను ఆక్రమిస్తున్నారు. దీంతో ప్రధాన రహదారుల్లోనే కాకుండా సర్వీసు దారుల్లోను ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ జామ్ అవుతోంది. సమీప దుకాణాల్లోకి కొనుగోలు చేసేందుకు వెళ్లే ద్విచక్ర వాహన చోదకులకు దారి దొరక్క ఇక్కట్లు పడుతున్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థలు, సెక్రెడ్‌హార్ట్ బాలికోన్నత పాఠశాల, ఆర్‌సీఎం ఎయిడెడ్, జూబ్లీ ఇంగ్లీషు మీడియం పాఠశాల, సోఫియా, సెయింట్ మేరీస్ కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు ఇక్కడ పార్కింగ్ చేసిన వాహనాలను తప్పించుకుని రాకపోకలు సాగించలేకపోతున్నామని, ఇబ్బందిగా మారుతుందని వాపోతున్నారు.

భవనాల ముందే వ్యాపారాలు..

జ్ఞానాపురం ప్రధాన రహదారి, రైల్వేస్టేషన్ రోడ్డు, జోన్–5 కార్యాలయ ప్రాంతాల్లో సర్వీస్ రహదారుల పక్కనే ఉన్న భవనాల ముందు వ్యాపారాలు నిర్వహించడం వల్ల కూడా ఇటువంటి సమస్యలు ఎదురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వ్యాపార, వాణిజ్య అవసరాలకు వచ్చే వారు వారి వాహనాలను రహదారులపై పార్కింగ్ చేస్తున్నారు. జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు నిత్యం ప్రయాణించే ఉద్యోగులు ప్రధాన రహదారితో పాటు ఫుట్‌పాత్‌లకు ఆనుకుని తమ వాహనాలను పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. గతంలో ఈ పార్కింగ్ వ్యవహారం, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను పట్టణ ప్రణాళిక సిబ్బంది, కంచరపాలెం ట్రాఫిక్ సిబ్బంది అడ్డుకున్నప్పటికీ కొంత కాలం తర్వాత చూసీ చూడనట్లు వ్యవహరించడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకుండా పోయింది. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నట్లయితే వాహన చోదకులకు కనీసం సర్వీస్ రహదారులైనా ఉపయోగపడుతుంటాయి. అవీ పార్కింగ్‌తో నిండిపోవడంతో ట్రాఫిక్ ముందుకు సాగని పరిస్థితి ఎదురవుతోంది. ఇప్పటికైనా సంబంధిత ట్రాఫిక్ ఉన్నతాధికారులు, జోన్–4 పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పర్యవేక్షించి సమస్యను పరిష్కరించాలని పలువురు స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అమ్మకాలు చేస్తున్న వ్యాపారులు

ఫుట్‌పాత్‌లపై నడవలేకపోతున్నాం



జ్ఞానాపురం రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. అటుగా రాకపోకలు సాగించాలంటే ఇబ్బందికరంగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఫుట్‌పాత్‌లు వ్యాపారులతో నిండిపోతున్నాయి. రోడ్డుపై నడిస్తే ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించాలి.
– జి.రాణి, జ్ఞానాపురం

ప్రత్యేక చర్యలు చేపడతాం

ఫుట్‌పాత్ ఆక్రమణలపై చాలా ఫిర్యాదులు మా దృష్టికి వచ్చాయి. ఈ సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాం. ఫుట్‌పాత్‌లపై వ్యాపారులను తొలగించేటప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో చర్యలు చేపడితే సరిపోదు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి దుకాణాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
– బొడ్డేపల్లి రాము, జోనల్ కమిషనర్, జోన్–5, జ్ఞానాపురం.

ఊగిసలాడుతున్న భవనం


75 ఫీట్ రోడ్డులో ఊగిసలాడుతున్న భవనం

జగదాంబ: పాతనగరంలో ఓ భవనం ఊగిసలాడుతూ ఆ ప్రాంతీయులను భయపెడుతోంది. జీవీఎంసీ 35వ వార్డు 75 ఫీట్‌రోడ్డులో ఇటీవల కొత్తగా నిర్మాణాలకోసం రెండు భవనాలు నేలకూల్చారు. ఈ రెండు భవనాల మధ్య ఉన్న ఓ భవనం కాలం చెల్లిపోవడంతో ఊగిసలాడుతూ నేడో రేపో కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. నిత్యం జనసంచారం ఉండే ఈ ప్రాంతంలో ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో అక్కడ వ్యాపారులు, సమీపంలో ఉన్న భవనాల యాజమానులు భయందోళనలు చెందుతున్నారు. అలాగే ఈ ప్రాంతం నుంచి పోర్టు వాహనాలు వెళ్తున్నప్పుడు ఈ భవనం ఊగిపోతోందని ప్రజలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని ఆ భవనాన్ని కూల్చివేయకపోతే ప్రమాదమని స్థానికులు చెబుతున్నారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీ

మురళీనగర్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో బుధవారం మధ్యాహ్నం మహిళలకు నిర్వహించిన రంగవల్లుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో మురళీనగర్, మాధవధార పరిసర ప్రాంతాల మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభ చూపారు. వివిధ రకాల రంగులతో తీర్చిదిద్దిన సంక్రాంతి ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి. గెలుపొందిన విజేతలకు భోగి ఉత్సవాల్లో బహుమతులు అందిస్తామని వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి చెప్పారు.

ఏబీవీపీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు

దాబాగార్డెన్స్: ఈ నెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్న ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ బుధవారం నగరంలోని ఓ హోటల్లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, రఘు విద్యా సంస్థల అధినేత రఘు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వర్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత 75 ఏళ్లుగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేశ అభివృద్ధిలో అనేక విధాలుగా భాగస్వామ్యం పంచుకుందని గుర్తు చేశారు. ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్ వేదికగా ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఏబీవీపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు చిరేగి శివకుమార్, రాష్ట్ర కార్యదర్శి యాచంద్ర పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో సంక్రాంతి సంబరాలు


భోగి మంటలతో సంక్రాంతి సంబరాలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల



కళకళలాడుతున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముందుగానే సంక్రాంతి సంబరాలు వచ్చేసాయి. కళాశాల కల్చరల్ కమిటీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల పాల్గొని భోగిమంటతో సంబరాలు ప్రారంభించారు. హరిదాస్ వేషధారణలో విద్యార్థినులు.. సంప్రదాయ దుస్తులు.. రంగురంగుల రంగవల్లులతో కళాశాల ప్రాంగణం శోభాయమానంగా మారింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థినులు అదరగొట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సనాతన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మన పండగలను మరువరాదన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగల ప్రాధాన్యతను విద్యార్థినులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి మాట్లాడుతూ ఈ సంక్రాంతి అందరికీ నూతన ఉత్సాహం నింపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రంగోలీ పోటీలు, సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. సంతోషి అనూష, కల్చరల్ కో ఆర్డినేటర్ బి. రాధమ్మ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

బస్సులన్నీ మోదీ సభకే

ఆటోలను ఆశ్రయించిన ప్రయాణికులు


సీఎంఆర్ బస్టాప్ వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల దుస్థితి


బస్సులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

దాబాగార్డెన్స్: ఆర్టీసీ ప్రయాణికులు బుధవారం మధ్యాహ్నం నుంచి ఇక్కట్లకు గురయ్యారు. సగానికి పైబడి ఆర్టీసీ బస్సులన్నీ ప్రధాన మంత్రి మోదీ సభకు తరలి వెళ్లడంతో ఆర్టీసీ ప్రయాణికులకు తిప్పలు తప్పలేదు. బస్సుల కోసం నిరీక్షించి ఆటోలను ఆశ్రయించిన వారు కొందరైతే.. ఒకటి..రెండు కిక్కిరిసిన బస్సుల్లో ఇబ్బందులు పడుతూ కొందరు ఎక్కారు. సాయంత్రం పరిస్థితి మరింత జఠిలమైంది. కళాశాలలు విడిచి పెట్టడంతో విద్యార్థులు ఒక్కసారిగా బస్టాప్‌లకు చేరుకున్నారు. అదే సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో పని చేసే ఉద్యోగులు కూడా విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు బస్టాప్‌లకు చేరుకున్నారు. చాలీ చాలని బస్సులు నడవడంతో ఇటు విద్యార్థులు, అటు ఉద్యోగులు, కార్మికులు వారి గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 6 గంటల తర్వాత పరిస్థితి మరింత తీవ్రమైంది. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్ వేదికగా సాగిన ప్రధాని మోదీ సభ 6.30 గంటలకు ముగియడంతో సభకు విచ్చేసిన వారంతా వారి గమ్యాలకు వెళ్లేందుకు బస్టాప్‌లకు క్యూ కట్టారు. బస్సుల్లేక.. సమయానికి రైళ్లు లేక సుదూర ప్రాంతాల నుంచి మోదీ సభకు వచ్చిన వారు అనేక కష్టాలు పడ్డారు. ప్రధాని మోదీ సభకు జనాలను తరలించేందుకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 600 బస్సులు పంపింది. నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ బస్సుల ద్వారా ప్రజలను తరలించారు. దూర ప్రాంతాలకు 60 బస్సులు నడిపారు. జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ సిటీ, సబర్బన్, మెట్రో సర్వీసులు దాదాపు నిలిచిపోయాయి.

వైభవంగా పొన్నాకు హారతి

- ధనుర్మాసం 24వ పాశురం నివేదన
- శ్రీకృష్ణుడిగా శ్రీవారి దర్శనం
- గోవింద నామస్మరణతో మార్మోగిన బల్లిగిరి


కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చిన బల్లిగిరి వెంకన్న, విశేష అలంకరణలో గోదాదేవి

అల్లిపురం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం గోవింద నామస్మరణతో మార్మోగింది. ధనుర్మాసం 24వ రోజు సందర్భంగా స్వామి వారిని శ్రీకృష్ణుడిగా, గోదాదేవి అమ్మవారిని పూలతో అలంకరించారు. ప్రత్యేక పాసురం, దీప పాశురం కావటంతో స్వామివారికి పొన్నాకులో వెన్న, పచ్చకర్పూరంతో విశేషంగా ప్రతి భక్తురాలు స్వయంగా హారతులు అందజేశారు. ఆలయంలో మూలవిరాట్టుకు ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు కుంభ హారతి నుంచి నక్షత్ర హారతి వరకు విశేష హారతులు చేపట్టారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జీవీ రమాబాయి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారు జాము 4 గంటల నుంచి దర్శనాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ధర్మదర్శనం, రూ.20, రూ.50 దర్శనాలు ఏర్పాటు చేశామన్నారు. 13వ తేదీ భోగి రోజు గోదారంగనాథుల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు. 17వ తేదీన సనాతన పరస మహోత్సవం వైభవోపేతంగా చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ప్రధాని సభకు వచ్చి.. పర్యాటక ప్రాంతాలకు..

- బీచ్, షాపింగ్ మాల్స్‌ను సందర్శించిన జనం


సాగరతీరానికి తరలిపోతున్న సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు



మోదీ సభకు శ్రీకాకుళం, పాతపట్నం, నందిగామ నుంచి వచ్చిన ప్రజలు

దాబాగార్డెన్స్: ప్రధాని మోదీ బహిరంగ సభకు విశాఖ నగర నలుమూలల నుంచే కాక శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పాతపట్నం, టెక్కలి, తాళ్లవలస, నందిగామ, పార్వతీపురం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. అక్కడి వరకు బాగానే ఉంది. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల మధ్యలో ఆయా ప్రాంతాల నుంచి వందలాది బస్సులు విశాఖ చేరుకున్నాయి. ఆ బస్సులకు బీచ్‌రోడ్డు విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వెనుక గల ఏపీఐఐసీ గ్రౌండ్‌లో పార్కింగ్‌కు అవకాశం కల్పించారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి ఆయా బస్సుల్లో అధిక సంఖ్యలో వచ్చిన వారిలో సగం మంది పర్యాటక ప్రాంతం సాగరతీరానికి క్యూ కట్టారు. వీరంతా మోదీ సభ పేరిట విశాఖకు వచ్చి.. బీచ్‌లో ఎంజాయి చేశారు. మరి కొంత మంది జగదాంబ జంక్షన్‌కు దారి తీశారు. అసలే సంక్రాంతి పండగ.. మోదీ సభ పేరిట విశాఖ వచ్చిన వారిలో కొందరు జగదాంబ జంక్షన్‌లో గల వస్త్ర దుకాణాలకు వెళ్లి షాపింగ్ చేసుకున్నారు. మరి కొంత మంది బీచ్ వద్దే కాసేపు కష్ట సుఖాలు మాట్లాడుకుని.. అక్కడి నుంచి వచ్చిన బస్సులపై కాకుండా.. అధిక శాతం మంది ఆర్కే బీచ్ నుంచి రైల్వే స్టేషన్‌కు చేరుకుని సభకు హాజరు కాకుండానే తరలి వెళ్లారు.

బస్సు డ్రైవర్లకు తిప్పలు : బస్సు డ్రైవర్లు తిప్పలు పడ్డారు. బస్సుల్లో వచ్చిన వారిలో సగం మంది డ్రైవర్‌కు చెప్పకుండానే బీచ్ షికార్.. షాపింగ్ మాల్స్‌కు వెళ్లిపోయారు. మరికొంత మంది మోదీ సభకు వెళ్లారు. వీరంతా వచ్చే వరకు డ్రైవర్లు పడిగాపులు కాయాల్సి వచ్చింది.


విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద గల పార్క్‌లో కాలక్షేపం చేస్తున్న పెద్దన్నలు


బీచ్‌లో కాలక్షేపం చేస్తున్న మహిళలు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు


దీక్షలో పాల్గొన్న సీఐటీయూ జగదాంబ జోన్ నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ పార్కులో చేస్తున్న దీక్షలు 1329వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని, ప్లాంట్ సొంత గనులు కేటాయిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశభక్తి పేరు చెప్పి సంపదను కారు చౌకగా ప్రైవేటు వ్యక్తులకు ధారపోయడం అన్యాయమన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల వచ్చింది కాదన్నారు. 67 గ్రామాల ప్రజలు ఇళ్లు, పొలాలు, ఆస్తులు త్యాగం చేస్తే వచ్చిందని గుర్తు చేశారు. 61 మంది సీపీఎం నాయకులు స్టీల్ ప్లాంట్ కోసం పదవీ త్యాగాలు చేశారన్నారు. ఈ ఉద్యమంలో 32 మంది బలిదానం చేశారని తెలిపారు. ప్లాంట్ పన్నులు, డివిడెండ్ల రూపంలో రూ. 50 వేల కోట్లు ప్రభుత్వానికి చెల్లించిందన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలంటే ఇక్కడి ప్రజల ఆమోదం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, ప్రకాశరావు, వై.రాజు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ధర్మారావుకు తెలుగు కీర్తి పురస్కారం

సీతంపేట : అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు యం.వి.ధర్మారావు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 21న విజయవాడలో అవార్డు అందుకోనున్నారు. ఈ పురస్కారానికి ధర్మారావు ఎంపిక కావడం పట్ల పాఠశాల హెచ్ఎం లక్ష్మీనరస, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.